
# మా భూమి

మణిభూషణ్



ఎప్పుడూ నాలో ఏదో భయం... హృదయాంతర కుహరాలలో ఒక చీకటి మూల చోటుచేసుకుంది. ఆ భయం, నాకే తెలియకుండా నాలో చోటుచేసుకున్న ఆ భయం... అప్పుడప్పుడు రూపుదిద్దుకున్నట్లు ఓ ఆలోచన... నన్ను కలవరపెడ్తూ వుంటుంది.

ఈనాడు ఈ నా భయాన్ని పోగొట్టడానికి నా చిన్ననాటి నేస్తం నా రాము లేడు. నన్ను అక్కున చేర్చుకొని ఓదార్చే రామూ తల్లి విరూపాక్షమ్మా లేదు. అందరిలోనూ పొంగిపొర్లే ప్రేమ స్వభావము ఒకటే అంటూ నమ్మకంగా వక్కాణించే నా తల్లి నూర్జహాను కూడా ఇప్పుడు లేదు.

అందుకేనేమో, అప్పుడప్పుడు ఈ నా భయం నేనున్నానంటూ నన్ను భయపెట్టడానికి ప్రయత్నిస్తూ వుంటుంది.

"ఈ భూమి నీది కాదు. ఈ దేవుడు నీ దేవుడు కాదు..." ఇలా ఏదో ఒక రోజు నన్ను ఎవరైనా అంటారేమోనని భయం. "నువ్వు నువ్వు కాదు..." అంటే నేను ఏమవుతాను! ఇలా ఒకదాని వెనుక ఒకటి... ఎన్నో సందేహాలు. ఒకటి చోటుచేసుకుంటే చాలు, 'నేను'... 'నేను'... అంటూ వరుసగా వస్తూనే వుంటాయి భయాల నీడలు పరుచుకుంటూ.

ఎన్నోసార్లు అనుకున్నాను "ఈ భూమితో నాకేమీ సంబంధం లేకపోతే, నాకు సంబంధం వున్న భూమి మరేదైనా వుందా?" అని. ఇక్కడే పుట్టాను. ఇక్కడే పెరిగాను. నా కుటుంబం, నా సంబంధ బాంధవ్యాలు అన్నీ ఇక్కడే. అలాంటిది, అకస్మాత్తుగా ఎవరో వచ్చి 'ఎవరు నువ్వు' అని ప్రశ్నిస్తే, ఏం సమాధానం చెప్తాను?! ఎవరైనా ఏం చెప్తారూ? కానీ అదృష్టం. నేను ప్రార్థించే దేవుడు, ఈ భూమి, ఆకాశం, చెట్లు, కొండలు... ఇవేమీ నన్ను ఏమీ అడగవు. ఏ విధంగానూ నన్ను కించపడేలా చేయవు. నా ఉనికిని ఆక్షేపించవు. అవహేళన చేయవు. నా ఉనికే లేకుండా చెయ్యాలని అనుకోవు. "అవే తలుచుకుంటే ఎవరిమైనా ఎంత"! కానీ మనుషులం కదా, అంత ఔన్నత్యం ఎక్కడినుంచి వస్తుంది. అందుకే ఈ కీచులాటలు.

ఆ రోజు రాదని నా ఆశ. రాకూడదని నా కోరిక. కానీ అప్పుడప్పుడు మథనపడడమయితే తప్పదు. నా మనసులో చోటుచేసుకున్న ఈ భయానికి అంకురార్పణ చేసినది ఒక సంఘటన. అయితే... అటువంటి సంఘటనలు మళ్ళీ ఏ రూపంలో విన్నా నా భయం, రూపు తెచ్చుకొని నన్ను భయపెడ్తూ వుంటుంది... ఆ సంఘటన మర్చిపోలేనిది.

***　　***

నేను, రాము ఒకే వూరులో పుట్టాము. ఒకే వూరిలో పెరిగాము. పక్కపక్కనే యిళ్ళు. ఎటువంటి అరమరికలూ లేని స్నేహం మాది. దానికి కారణం బహుశ మా రెండు కుటుంబాల మధ్య, ముఖ్యంగా మా యిద్దరి తల్లుల మధ్య వున్న స్నేహం కూడా కావచ్చు. మా మధ్య వున్న మతభేదం మాకసలు మనసుల్లో కూడా మెదిలేది కాదు. మా అమ్మ నూర్జహాను రోజుకు మూడుసార్లు అల్లాతోపాటు రాముడిని కూడా ప్రార్థించేది. హిందూ కుటుంబంలో వివిధ దేవుళ్ళను ఎలా కొలుస్తారో అలానే మా యింట్లోనూ అల్లాతోపాటు రాముడు, కృష్ణుడు, ఆంజనేయుడు- అందరినీ ప్రార్థించేవాళ్ళం. అందుకేనేమో హిందూ దేవుడనో, ముస్లిం దేవుడనో తేడాకూడా తెలియకుండా పెరిగాము. ఆ అవసరం ఎప్పుడూ రాలేదు మాకు. రాము తల్లి విరూపాక్షమ్మ మా అమ్మలాగే హిందూ దేవుళ్ళతోపాటు అల్లాని ప్రార్థించేది. దానివల్లేఏమో మావి వేరువేరు మతాలన్న ఆలోచన ఎప్పుడూ మాకు కలగలేదు. మా వూరిలో అందరూ ఎంతో స్నేహంగా వుండేవారు. ప్రేమను పంచేవారు. ఆ రోజులే వేరు. ఆత్మఔన్నత్యం సాధించడమే అందరి ధ్యేయంగా వుండేది. అందుకే మతవిభేదాలు వుంటాయని కూడా మా ఊహకందనిదిగా వుండేది. అటువంటి అమాయకత్వపు మనుషుల మధ్య పెరిగాము. మా చదువుయి మాకిద్దరికీ ఇరవై ఏళ్ళు నిండేసరికే అదృష్టం వరించి ఉద్యోగాలు వచ్చాయి. అదీ ఒకే వూరులో ఒకే కంపెనీలో. మా సంతోషం చెప్పనలవే కాదు. "కలిసి తిరిగారు కలిసే ఉద్యోగానికి వెళుతున్నారు" అంటూ వూరిలో అనని వారే లేరు. ఉద్యోగానికి బయలుదేరుతున్న మమ్మల్ని మా తల్లులు కళ్ళనీళ్ళు పెట్టుకొని అక్కున చేర్చుకొని దీవించారు.

రామూ తల్లి రక్షగా నా మెడకి ఆంజనేయస్వామి బిళ్ళవున్న తాడు కడితే, రామూకు మెడలో అల్లాని ప్రార్థించి మంత్రించిన రక్షను కట్టింది మా అమ్మ. జాగ్రత్తగా వుండండి అంటూ సాగనంపారు మమ్మల్ని.

కొత్త వూరు అయినా ఇద్దరం కావడంతో అందులోనూ బాల్యస్నేహితులం కావడంతో కొత్త లేకుండానే రోజులు జరిగిపోయాయి. ఆఫీసు పనికీ, వూరికీ తొందరలోనే అలవాటుపడ్డాము. ఒకరి వెంట ఒకరం నీడలా కలిసి తిరిగేవాళ్ళం. "మమ్మల్ని చూసి ఆఫీసులో ఈర్ష్యపడని వారే లేరు" అని అనుకునే వాళ్ళం. దాని ఫలితమే ఆ సంఘటన అని అనిపిస్తూంటుంది.

***　　***

ఆ రోజు ఎప్పటిలానే ఆఫీసుకు వెళ్ళాం. అటెండెన్స్ రిజిష్టర్‌లో సంతకాలు చేసి ఎవరి సీటుకు వాళ్ళు వెళ్ళబోతున్నాం.

ఎవరో మొరటుగా "సమీర్" అని పిలవడం వినపడి ఇద్దరం ఒకేసారి వెనక్కి తిరిగాం.

"మీ వాళ్ళు రైలును కాలిస్తే మేం వూరుకుంటామా, చేతులు కట్టుకొని కూర్చోవడానికి మేమేమీ గాజులు తొడుక్కుని కూర్చోలేదు... అంతకంతా వడ్డిస్తాము" అంటున్నది రంగారావు. సెక్షన్ మేనేజర్. మధ్యవయస్కుడు. అతనా మాటలు అంటుంటే అతని మొహం కర్కశత్వంతో భయంకరంగా వుంది.

"ఏదో రైలు కాలిపోవడానికి మీరిలా మాతో మాట్లాడడానికి సంబంధం ఏమిటో మాకర్థం కావటం లేదు"

రాము మాటలలో అమాయకత్వం... అక్కడ చుట్టూవున్న వారందరికీ రంగారావుని నిలవేసినట్లనిపించింది.

"నేను సమీర్‌తో అంటున్నాను"

"ఆ రైలుకీ, మాకూ ఏమీ సంబంధం లేనపుడు, మీరు ఆ మాటలు నాతో అన్నా సమీర్‌తో అన్నా, ఆ మాటకి వస్తే ఎవరితో అన్నా ఒకటే... అసలు మీరు ఏం చెప్పదలచుకున్నారు"- రాము గొంతులో నిర్భయత్వం గంభీరంగా మోగింది.

ఆలోపు అక్కడ చుట్టూచేరిన వాళ్ళంతా మమ్మల్నిద్దరినీ "ఎందుకతనితో గొడవ... నడవండి" అంటూ బయటకు తీసుకెళ్ళిపోయారు.

"వాడినంటే వీడికేంటీ..."- నెమ్మదిగా అయినా ఇంకా కర్కశంగానే వుంది రంగారావు గొంతు.

ఆ సాయంత్రం ఆఫీసు నుండి మేము బయటకు వస్తుంటే పక్క సెక్షనులో పనిచేసే ఆనందరావు పలకరించాడు.

"పొద్దున మీకూ రంగారావుకు మాటామాటా వచ్చిందటగా"...

మేమిద్దరం మొహమొహాలు చూసుకోవడం చూసి "అంత ఆశ్చర్యపోకండి. ఇటువంటి వార్తలు తొందరగా వ్యాపిస్తాయి" అన్నాడు ఆనందరావు.

మేము నిశ్శబ్దంగావుండడంతో అతనే మళ్ళీఅన్నాడు.

"వాళ్ళ లోపల వుండే సేడిజాన్ని బయటకు తీసుకు వచ్చే అవకాశం కోసం చూస్తూంటారు రంగారావులాంటి వాళ్ళు.

అటువంటివాళ్ళకు ఈవేళ మతం కారణంగా దొరుకుతుంది. రేపు కులం... ఆ తర్వాత ఇంకోటి. అలా ప్రజల మధ్య ఏదోవిధమైన గొడవలు పెంచి, వాటిని ఎంజాయ్ చెయ్యడానికో, ఎన్‌కాష్ చేసుకోవడానికో

అవకాశం దొరుకుతూనే వుంటుంది. అదే మనందరి దౌర్భాగ్యం."

ఆవేశంగా అన్నాడు ఆనందరావు.

అతని మాటలు కూడా మాకేమీ అర్థం కాలేదు. అయోమయంగా అతనినేచూస్తూ ఆ మాటలు విన్నాం. మా కర్థమయిందల్లా ఆనందరావు గొంతులో ఆర్ద్రత.

"జాగ్రత్తగా వుండండి. ఈ గొడవలకే కాదు ఈ వూరికి కూడా మీరు కొత్త... గొడవలు జరిగేలా వున్నాయి. పొద్దుపోయాక ఎక్కడికీ వెళ్ళకండి"

ఆనందరావు చెప్పే జాగ్రత్తలకు మౌనంగా తలూపాము.

*** ***

ఆనందరావు చెప్పినట్లే లోపల కుతకుతలాడుతున్న దావానలం బయటకు రావడానికి ఎన్నో రోజులు పట్టలేదు.

*** ***

ఆ రోజు మామూలుగానే ఆఫీసుకు బయలుదేరాం.

మేము ఎక్కిన బస్సును రాళ్ళువేసి మధ్యలోనే ఆపేశారు ఓ గుంపు.

వాళ్ళు ఉద్రేకంతో ఊగిపోతున్నారు. అందరి చేతిలో ఆయుధాలు... "పట్టుకో"... "కొట్టు"... "చంపు"... అవే అరుపులు.

అందరమూ భయంతో కంగారుతో కిందకి దిగి వాళ్ళని తప్పించుకొని పారిపోవడానికి ప్రయత్నించాం. ఆ గలాభాలో, కొట్టులాటలో నేనూ రామూ తలోదిక్కూ అయ్యాము. ఎక్కడ చూసినా ఆయుధాలు పట్టుకొన్న మనుషులు గుంపులు గుంపులుగా. వాళ్ళు మామూలు మనుషుల్లా కనిపించలేదు నాకు. ఎవరో ఒకరిని చంపాలన్న పైశాచిక కోరికతో ఊగిపోతున్నట్లనిపించింది.

నేను ఆగిఆగి అటువంటి గుంపులను తప్పించుకొని పరిగెట్టాను. అలా ఎంతసేపు పరుగుపెట్టానో కూడా తెలియదు. అటువంటి పరిస్థితిలోనూ రామూ గురించిన ఆందోళన ఒకవైపు నన్ను నీరుకారుస్తూనే వుంది. ఆ భయానికి ఆ ఉద్రిక్తతకు తట్టుకోలేకపోయాను. నా ప్రమేయం లేకుండానే ఓచోట కూలబడి భోరుభోరుమని ఏడుస్తూ వుండిపోయాను. అలా ఎంతసేపు ఏడ్చానో కూడా తెలియదు. తలఎత్తి చూసేసరికి నాచుట్టూ ఎవరినుంచి అయితే అంతసేపు తప్పించుకొని పరుగుపెట్టానో వాళ్ళే కత్తులతో, కొడవళ్ళతో.

"ఎవరు నువ్వు? హిందువా? ముస్లిమువా?"

"ఎవరు?... ఎవరు?"...

నా గుండె కొట్టుకోవడం ఆగిపోయింది కాసేపు. నోట మాటరాక నిశ్చేష్టుడయిన నన్ను చూసి-

"వీడు హిందువులా వున్నాడు. మెడలో ఆంజనేయస్వామి బిళ్ళ కనబడటం లేదూ?... వదిలేయండి. మనవాడే... ముస్లిముల ఆగడాలు చూసి భయపడి వుంటాడు"- ఉన్మాదంలో కూడా అర్థంలేని జాలి.

నా షర్టు లోపల నుండి బయటకు వచ్చిన ఆంజనేయస్వామి బిళ్ళ మీద సూర్యకాంతి పడి ఆ కాంతి మళ్ళీ వాళ్ళ ఆయుధాల మీదపడి వింతగామెరుస్తోంది.

"రండి... రండి... వాళ్ళు ఇక్కడెక్కడో వుండేవుంటారు" అంటూ హడావిడిగా తనను వదిలి పరిగెత్తారు ఆ మూక వేరే దిక్కుకు.

నన్ను రక్షించిన ఆంజనేయస్వామి బిళ్ళను మృదువుగా స్పృశించి కృతజ్ఞతతో ముద్దుపెట్టుకున్నా. నా కళ్ళ నుండి నీళ్ళు చాలాసేపు ఆగకుండా ప్రవహిస్తునే వున్నాయి. నాకు తెలియకుండానే చిన్నప్పటినుండీ నేను రోజూ స్తుతించే ఆంజనేయస్తోత్రం నా నోటినుండి బయటకు వచ్చింది. కాస్సేపటికి మామూలు మనిషిని అయ్యాను. నన్ను రక్షించిన ఆ దేవుడిని రామూకు కూడా తోడుగా వుండమని కాస్సేపు మనసులో ప్రార్థన చేసుకున్నాను. ధైర్యం తెచ్చుకొని వచ్చిన దారినే రామును వెదకడం మొదలుపెట్టాను.


రోడ్లు అన్నీ నిర్మానుష్యంగా వున్నాయి. ఎక్కడ చూసినా శవాలు, కాలుతున్న వాహనాలు. అటూఇటూ ఆయుధాలతో పరిగెడుతున్న మనుషులు. వారిని తప్పించుకుంటూ, ఆంజనేయుని స్మరిస్తూ రాముకోసం

**ఉన్మాదంలో వాళ్ళు నన్ను ప్రశ్నించిన ప్రశ్న మాత్రం నన్నెపుడూ కలవరపెడ్తూ వుంటుంది. ఎందుకంటే హిందువును ముస్లిమును కాని నేను ఎవరినో నాకే తెలియదు. నేనెవరిని అయినా నా జీవితం ఈ గడ్డతో ముడిపడివుంది**

వెతుకుతున్న నాకు, రాము కనపడ్డాడు... రక్తపు మడుగులో. రామూను ఆ పరిస్థితిలో చూసిన నాకు కాళ్ళూచేతులూ ఆడలేదు కాసేపు. రామూని నేను లేవనెత్తపోయేంతలో ఓ నలుగురు యువకులు ఆపద్బాంధవుల్లా సహాయం చేయడం, ఆసుపత్రిలో ఎడ్మిట్ చేయడం, రామూకి రక్తం ఎక్కువ పోవడంతో నా రక్తమే తనకి ఎక్కించడం- అంతా కలలోలా జరిగిపోయాయి.

ఆ తర్వాత నాకు తెలిసింది- రాముని ఆసుపత్రిలో ఎడ్మిట్ చేయడంలో నాకు సహాయం చేసిన ఆ నలుగురు యువకులు 'గొడవల్లో ఇరుక్కుపోయి ఇక్కట్లు పాలయిన ప్రజలకు సహాయం చేయడానికి వచ్చిన స్వచ్ఛంద సేవకులని! ఓ క్షణం మనుషుల్లో మృగాలను చూశాం. మరోక్షణం, ప్రాణాలను సైతం లెక్కచేయక పరోపకారమే పరమార్థం అనుకునే వాళ్ళను చూశాం. దేవుడి సృష్టి అద్భుతం అంటారు ఇందువల్లనేనేమో!!

రామూకు స్పృహ వచ్చాక చెప్పాడు- 'తను ఒక ముస్లిం గుంపు ఉన్మాదానికి



గురికావడం, అతని మెడలో రక్షరేకు వల్లే చావు నుంచి తప్పించుకోగలగడం'. వాళ్ళు ఓ దెబ్బ వేసిం తర్వాత ఆ రక్షరేకు చూసి, వదిలి వెళ్ళిపోయారట. మమ్మల్ని రక్షించింది మా తల్లుల దీవెనలో, మా అమాయకత్వమో తెలియదు కానీ ఆ సంఘటన మమ్మల్ని మరింత దగ్గర చేసింది. మమ్మల్ని రక్షించిన దేవుళ్ళకు మతాలు అడ్డులేవని అనుభవపూర్వకంగా తెలుసుకున్నాము. ఆ దుర్ఘటన నుండి ప్రాణాలతో మేం బయటపడడమే ఆశ్చర్యంగా వుంటుంది తల్చుకున్నప్పుడల్లా.

ఆసుపత్రిలో మమ్మల్ని చూడ్డానికి వచ్చిన ఆనందరావుతో జరిగింది చెపుతూ "దేవుడికి లేని ఈ తేడాలు మనుషులకెందుకు... ఏమిటో ఉన్మాదం?" అన్నాను.

"వాళ్ళు వట్టి రౌడీమూక. వ్యక్తులా ఏమైనానా? అవకాశం కోసం పొంచిచూసే పిశాచాల మూక"

"అమాయకమైన ప్రజలను చంపాలనుకునే మతం మతమూ కాదు, దేవుడు దేవుడూ కాదు" అన్నాడు ఆనందరావు.

ఆయన మాటలు మా భావాలకు గొంతునిచ్చాయి.

"సృష్టిలో మనుషులు మాత్రమే వారివారి ఆధిక్యాన్ని వేరువేరు విధాలుగా వ్యక్తంచేయడానికి ప్రయత్నిస్తుంటారు. అటువంటి అమానుషమైన ప్రయత్నాలలో ఇదీ ఒకటి. సృష్టికి అందరూ సమానమే."

"మీరే చూడండి. ఇద్దరూ తలో మతమయినా అది ఏ విధంగానూ మీ స్నేహానికి అడ్డురాలేదు. మిమ్మల్ని కాపాడిన దేవుడు కూడా ఒకడే అన్న నమ్మకాన్ని మీ హృదయాల్లో దీపంలా వెలిగించి మిమ్మల్ని మరింత దగ్గర చేసింది."

"స్నేహంలోనో ప్రేమలోనో మాధుర్యం చవిచూసిన వాడెవడూ ఇటువంటి పనులు ఎప్పుడూ చేయలేడు. చివరికి వాళ్ళు వాళ్ళ కుటుంబంలో ఏ ఒక్కరితోనయినా సజావు అయిన అనుబంధం కలిగుంటే ఇటువంటి అమానుషకరమైన పనులు చెయ్యడం అసాధ్యమే అవుతుంది."

*** ***

రామూ కోలుకోగానే, మేమిద్దరం మా వూరు తిరిగి వచ్చేసాము. జరిగింది విన్నాక, మేం మళ్ళీ ఉద్యోగాలకు వెళ్ళడానికి మా తల్లిదండ్రులు ఎంతమాత్రం ఒప్పుకోలేదు. ఇంటికి వచ్చాక చాలారోజులు మేం నిద్రలో ఉలిక్కిపడి లేస్తూ వుండేవాళ్ళమని మా అమ్మలు చెప్తుండేవారు. ఆ సంఘటన, మాకెదురయిన పరిస్థితి మా వూరిలో కథలుగా చెప్పుకునేవారు.

*** ***

ఆ సంఘటన జరిగి ఏళ్ళు గడిచాయి. కానీ ఉన్మాదంలో వాళ్ళు నన్ను ప్రశ్నించిన ప్రశ్న మాత్రం నన్నెపుడూ కలవరపెడ్తూ వుంటుంది. ఎందుకంటే హిందువును ముస్లిమును కాని నేను ఎవరినో నాకే తెలియదు. నేనెవరిని అయినా నా జీవితం ఈ గడ్డతో ముడిపడివుంది. ఈ భూమి నా భూమి. నన్ను వెంటాడే ఈ భయానికీ, ఈ భూమి మీద నా ఉనికిని ప్రశ్నించే ఈ ప్రశ్నకీ ఏ అర్థమూ లేదు.

'సారే జహాసె అచ్ఛా... హిందుస్తాన్ హమారా' దూరంగా సన్నగా వినిపిస్తున్న ఆ పాటను వింటూ దీర్ఘంగా నిట్టూర్చాను.

"తాతా! నేను ఇంటర్వ్యూకు వెళ్తున్నా. నన్ను దీవించు" అంటూ వచ్చిన నా మనవడితో "ఆంజనేయస్వామికి దండం పెట్టుకొని వెళ్లు సలీం. అంతా మంచే జరుగుతుంది" అన్నాను. అలాగే అంటూ సలీం బయటకు వెళ్ళాడు. మా ఇంటికి రెండిళ్ళవతల వుంటున్న శకుంతల కొడుకు వంశీకృష్ణ అప్పుడే లోపలకి పరుగెత్తుకు వచ్చాడు స్కూల్‌బేగ్‌తో.

"తాతా! చెల్లాయి ఒకటే ఏడుస్తోంది. నిన్ను తాయెత్తు ఒకటి తయారుచేసి ఇమ్మంది మా అమ్మ. తయారుచేసి వుంచితే, నేను స్కూలు నిండి ఇంటికి వెళ్ళేటప్పుడు తీసుకువెళతా" అని చెప్పి తూనీగలా పరిగెట్టాడు వంశీకృష్ణ.

"నువ్వు వచ్చేవరకూ ఎందుకు, నేనే వెళ్ళి కడతా ప్రార్థన అదీ అయ్యాక. అసలే మీ అమ్మకి భయం ఎక్కువ" అంటూ కుర్చీలోంచి లేచాను... అన్నీ మర్చిపోయి. ●